గలగలా నవ్వింది సునీత.

ఆ నవ్వుతో జత కలిపాడు భాను ప్రసాద్.

వాళ్ళిద్దరూ కనకదుర్గ కొండపైకి వెళ్ళే దారిలో కొంచెం ఎత్తులో రోడ్డు అంచున వున్న గోడపైన కూర్చుని, క్రింద రోడ్డున వెళ్ళే అగ్గిపెట్టెల్లాంటి బస్సులను, చీమల్లాంటి మనుష్యులను చూస్తున్నారు. వాళ్ళిద్దరూ ఎప్పుడు కలవాలన్నా అక్కడే కలుస్తారు.

అప్పుడు సమయం ఆరు గంటలయ్యింది.

సునీత అంటోంది "అబ్బా... నిజంగా ఇది గ్రేట్ ఎస్కేప్ భాను. నువ్వుగాని రెండు నిమిషాల ముందు ఆ సందులోకొచ్చాంటే మన బండారం బయటపడిపోయేది. జస్ట్ మిస్. మా అన్నయ్య అటువెళ్ళాడు, నువ్వు వచ్చావ్. లేకపోతే గొడవయ్యిపోయేది ఈ పాటికి".

"ఎందుకు గొడవ"? "మీ అన్నయ్యేగా"? ఒకవేళ తెలిసినా ఏమైనా అంటాడని నేను అనుకోను. ఒకవేళ ఏమైనా అనుకున్నా..."

మధ్యలో ఆపుచేసింది సునీత. "మా అన్నయ్య అయితే మాత్రం నీకు బెస్ట్ ఫ్రెండేగా. ఏమి అనుకుంటున్నావ్ మరి. అంత ధైర్యం వున్నవాడివి మన

# నేటి ప్రేమికులు

ప్రేమ విషయం మా అన్నయ్యకి చెప్పడానికి ఎందుకు భయపడ్డావ్"?

"నేనేం భయపడ్లేదు. మీ అన్నయ్య పెరిగిన పరిస్థితులే వేరు. చిన్నప్పట్నించి వాడు ప్రేమ, గీమ అంటే మండిపడతాడు. వాడికి ఇలాంటి వాటి మీద నమ్మకాలు లేవు. ఎవరైనాఆ మాట అంటేనేతిడతాడు. అలాంటి వాడు మన విషయం అంగీకరిస్తాడని ఏమిటి నమ్మకం? పోనీ నన్నంటున్నావు చిన్నప్పట్నుంచి కలిసి మెలిసి వుంటున్నారుగా, నువ్వే చెప్పొచ్చుగా అని అడిగాడు భాను.

"అమ్మో... నేనా, నాకు భయంబాబు. మామూలు విషయాలైతే మా అన్నయ్యని ఎదిరించే చనువుంది. ఈ విషయంలో ఎదిరించడమా? ఇంకేమైనా వుందా అని గుండెల మీద చేయుంచుకుంది సునీత.

అప్పుడప్పుడే క్రమంగా ఆకాశంలో నక్షత్రాలు కానరాసాగాయి. సునీత గుండెల మీద చెయ్యి తొలగించి దగ్గరికి తీసుకుంటూ అన్నాడు భాను" నాకు తెలియదా యేంటి. అయినా ఇప్పటి మాట కాదు కదా. ఇంకా సంవత్సరం పైగానే వుంది. ఈ లోపల పరిస్థితులు మారకపోతాయా" అన్నాడు ధీమాగా.

"అవును. నాకూ అలాగే అనిపిస్తోంది. మనమేదైనా ఉపాయం ఆలోచించలేకపోతామా అని" అంది అతని గుండెలో గువ్వలా ఒదిగిపోతూ. వాళ్ళకిప్పుడు ఈ సమస్య చాలా చిన్నదిగా కనబడుతోంది. అగ్గిపెట్టెల్లాంటి బస్సుల్లాగా, చీమల్లాంటి మనుష్యుల్లాగా.

** ** ** **

"ఎక్కడికెళ్ళావు సునీతా"? గుమ్మంలో అడుగు పెట్టే పెట్టగానే అడిగాడు కృష్ణ.

అబ్బా! లోపలికి రాగానే అడిగేస్తావేంటిరా. ఎంతో నీరసంగా వుంటుందో తెలుసా"? అని లోపలికి వెళ్ళి మంచినీళ్ళు త్రాగి వచ్చి సోఫాలో కూర్చుంది". "ఆ ఇప్పుడు చెప్పు" అంది.

"ఎక్కడికి వెళ్ళావు"? మళ్ళీ అదే ప్రశ్నవేశాడు కృష్ణ.

# కొమ్మూరి రవికిరణ్

"మ్యాట్నీకి సినిమాకి వెళ్ళి అట్నుంచి మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాను" అబద్ధం చెప్పింది సునీత.

"సినిమా నుంచి తిన్నగా ఇక్కడికి వచ్చేయొచ్చుగా. మీ ఫ్రెండ్ ఇంటికి దేనికి"?

"ఏ... ఇప్పుడేమయిందని"?

"ఏం లేదు. ఎదుగుతున్న ఆడపిల్లవు కదా. అమ్మ కంగారు పడుతోంది" అన్నాడు కృష్ణ.

"ఏ నువ్వు వెళ్తున్నావ్‌గా బయటకి. అమ్మ అప్పుడు కంగారు పడదేం? ఎదురు ప్రశ్నవేసింది సునీత.

"నేనంటే ... మగవాడిని".

"నువ్వు మగవాడివయితే నాకేంటి, నేను ఆడదాన్నైతే నీకేంటి. నువ్వు బయట తిరుగు నేను వద్దనను. నేనూ నా ఇష్టం వచ్చినట్టు తిరుగుతాను నువ్వూ అడ్డుపెట్టకు" అనేసి లోపలికి వెళ్ళిపోయింది సునీత.

విశ్చేష్టుడై చెల్లెలు వెళ్ళిన వంకే చూస్తుండిపోయాడు. ఈ మధ్యనే ఏదో మార్పొచ్చింది సునీతలో. ఏమిటది. చిన్నప్పటి సునీతలా లేదు. చిన్నప్పుడు తానూ, సునీత స్కూలు ఎగ్గొట్టి పార్కులో కూర్చుని సాయంకాలం దాకా ఆడుకునే వారు.

ఆ అల్లరి సునీతలా లేదు.

చిన్నప్పుడు తాను కొడితే ఊరుకోకుండా తనూ కొట్టేసి ఏడ్చి తల్లి చేత తనకి మళ్ళీ దెబ్బలు తినిపించేది.

ఆ పెంకి సునీతలాలేదు.

తనకు కొద్దిగా తక్కువ మార్కులు వస్తే, ఇంట్లో చెప్పేస్తానని బెదిరించేది. అప్పుడు తను ఇంట్లో చెప్పొద్దని బతిమాలితే గర్వంగా నవ్వుకునేది.

ఆ చిలిపి సునీతలా లేదు.

బాగా మార్పొచ్చింది. ఇది వరకులా మాట్లాడడం లేదు. ఇదివరకులా సమాధానం చెప్పడం లేదు. ఇది వరకులా ప్రేమగా వుండటం లేదు. కారణం ఏమిటో తనే స్వయంగా తెలుసుకోదల్చాడు కృష్ణ.

** ** ** **

"హల్లో కృష్ణా"

ఏదో రాసుకుంటున్న కృష్ణ వెనక్కి తిరిగి చూశాడు.

"హల్లో భానూ రా... రా ఏరా ఒళ్ళు ఎలా వుంది. కలవట్లేదు ఈ మధ్య" నవ్వుతూ ప్రశ్నించాడు కృష్ణ.

"ఈ మధ్య చాలా బిజీగా వుంటున్నామరా".

"ఇదివరకు ఎంత బిజీగా వున్నా కలిసే వాడివి కదురా".

"అవును ఇదివరకు కలిసేవాడిని. మీ నాన్నగారు పోయారని నువ్వు అర్ధంతరంగా చదువు ఆపేసి, ఉద్యోగం అంటూ ఇంట్లో అసలు వుండటం లేదు. నాకింకా ఒక సంవత్సరం వుంది చదువు. తరువాత ఫ్రీ బర్డ్‌ని అన్నాడు భాను.

"ఇంకేమిటి విశేషాలు. అమ్మగారు బావున్నారా"? అడిగాడు కృష్ణ.

"బావున్నారు గాని మీ చెల్లెలేది" అడిగాడు భాను.

"ఏం"?

"ఏం లేదు ఊరికే. ఈ మధ్యన అస్సలు కనబడటం లేదు కదా! అందుకని".

"దానికి ఈ మధ్యన తిరుగుళ్ళు ఎక్కువయ్యాయి" అన్నాడు కృష్ణ.

'ఓ ... కృష్ణా ... ఇప్పుడు కాకపోతే ఎప్పుడు తిరుగుతార్రా, అందరూ నీలాగే వుంటారా"? "సరేగాని మళ్ళీ వస్తాను. నాకు అర్జంటు పని వుంది" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు. ఆశ్చర్యంగా చూశాడు కృష్ణ.

ఏమిటి వీడిలో కూడా మార్పొచ్చింది.




ఇదవరకు తనను రోజుకు ఒక్కసారి కలుసుకోలేనిదే వుండలేక పోయేవాడు. అలాంటిది వీడిలో కూడా సడన్‌గా మార్పు వచ్చింది.

కాస్సేపున్న తర్వాత ఏదో అర్థం అయినట్టు తలపంకించాడు కృష్ణ. అయితే అర్థం అయిందని బయట పడలేదు.

** ** ** **

"ఇలా ఎన్నాళ్ళు" అన్నాడు ఆవేశంగా భాను.

వాళ్ళిద్దరూ రోజూ కలుసుకునే చోటే కలుసుకున్నారు.

వాళ్ళకిప్పుడు క్రింద రోడ్డున వెళ్ళే బస్సులు, మనుష్యులు అగ్గిపెట్టెల్లాగా, చీమల్లాగా కనబడటం లేదు. వాళ్ళకి సమస్య చాలా పెద్దదిగా కనబడుతోంది.

"నిన్నే ఇలా ఎన్నాళ్ళు అంటే మాట్లాడవే" అన్నాడు భాను విసుగ్గా.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను".

"ఆలోచించే టైం లేదు. తేల్చుకోవలసిన సమయం వచ్చింది. కనీసం నీకు ఇంకొక్క సంవత్సరం ఎక్కువున్నా పోయేది".

"అంటే ఏం?"

"అంటే నీకు మైనారిటీ తీరుతుంది.

"తీరితే"?

"మనం లేచిపోవచ్చు". మైనారిటీ తీరిన తర్వాత మనల్ని అడిగే వాళ్ళు ఎవ్వరూ వుండరు" అన్నాడు భాను.

"లేచిపోవటమా... ఛీ" అంది సునీత.

"ఏమయింది".

"అది పిరికి వాళ్ళు చేసే పని".

"మనమేదో ఇప్పుడు ధైర్యంగా వుంటున్నట్టు" అన్నాడు వ్యంగ్యంగా.

కాసేపటిదాకా ఎవరూ మాట్లాడలేదు.

తర్వాత భాను "అసలు నాకు మీ అన్నయ్య రాక్షసుడిలా కనబడుతున్నాడు" అన్నాడు కోపంగా.

"అవును నాకూ అలాగే కనబడుతున్నాడు" అంది సునీత.

"పోనీ మీ అమ్మగారితో మాట్లాడతాను. ఆవిడకి ఇష్టమైతే మీ అన్నయ్య ఏం చేయలేడు కదా"? అడిగాడు భాను ఆశగా. "నీకు తెలియందేముంది భానూ. మా అన్నయ్యమాటే మా అమ్మకు వేదవాక్కు" అంది సునీత.

తర్వాత మళ్ళీ సునీతే అంది "నాకు చాలా భయంగా వుంది భానూ" అంది ఏడుపు గొంతుతో.

"ఛ... భయమెందుకు నేనున్నాగా. పరిస్థితులు అప్పటిదాకా వస్తే నేనే ఎదిరిస్తాను మీ అన్నయ్యని" అన్నాడు భాను తాత్కాలిక ధృడ నిశ్చయంతో.

ఆరు నెలలు గడిచిపోయాయి.

ఒక రోజు

కృష్ణ తాను రోజూ పనిచేసే వర్క్ షాపు నుంచి ఇంటికి వచ్చేసరికి తల్లి ఇంట్లో లేదు. సునీత దిగాలుగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. దగ్గరకు వెళ్ళి పిలిచాడు.

"సునీతా"

"ఉ..." ఉలిక్కి పడింది సునీత.

"ఏమిటే అలా వున్నావు"? అడిగాడు ప్రేమగా.

"ఏం లేదురా" అని లోపలికి వెళ్ళబోయింది. చెయ్యి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టి లాలనగా అడిగాడు.

"ఏదో వుంది, నాకు చెప్పవే".

"నిజంగా ఏం లేదురా" తప్పించుకోబోయింది.

"నాక్కూడా చెప్పవా" ఇదివరకులా నాతో ఆప్యాయంగా మాట్లాడడం లేదు ఎందుకని"? అడిగాడు చాలా నెమ్మదిగా.

"ఇహ ఆపుకోలేక ఒక్కసారి బావురమంది సునీత".

"అరె... ఏమిటే... ఏమయింది?"

వెక్కుతూ అంది "నన్ను...నన్ను... మోసం చేశాంరా".

"ఏమిటి"?

"జరిగింది క్లుప్తంగా చెప్పింది. చెప్పి చివరకు అంది. "నిజంగా ఇందులో నా తప్పు లేదురా. అతనే నన్ను ప్రేమించానన్నాడు, పెళ్ళి చేసుకుంటానన్నాడు. ఇలా దొంగ చాటు ప్రేమ ఎన్నాళ్ళు నీతో చెప్పేయమన్నాను. మొదట్లో చెప్తానన్నాడు. ఇప్పుడు తనవల్ల కాదని చెప్పేసాడు. అతనికి గుడ్‌బై చెప్పేసి వచ్చేశాను".

"ఎందుకు"?

"నిన్ను నా ఎదురుగుండా తిడుతుంటే చూస్తూ వూరుకోలేకపోయాను. నిన్ను రాక్షసుడన్నాడు, ప్రేమంటే తెలియని పశువు అన్నాడు. మనిద్దరి మధ్యా గొడవలు పెట్టడానికి ప్రయత్నించాడు. అందుకే నాకు అతనంటే అసహ్యం వేసింది" అంది సునీత.

సునీత చెప్పింది చాలా శాంతంగా విన్నాడు. చివరకు అన్నాడు. "సర్లే జరిగిందేదో జరిగిపోయింది. ఆ విషయం మర్చిపో" అన్నాడు నిర్లిప్తంగా.

తేలికయిన హృదయంతో లోపలికి వెళ్ళిపోయింది సునీత.

దాదాపు గంట తర్వాత అక్కడికి బాను వచ్చాడు.

"కృష్ణా నీతో కొంచెం మాట్లాడాలి. అలా వెళ్ళొద్దాం వస్తావా? అని అడిగాడు.

విషయం తెలుసు కాబట్టి ఏం మాట్లాడ కుండా అతని వెంట వెళ్ళాడు. ఇద్దరూ జనసంచారం లేని ప్రదేశంలో నడుస్తున్నారు.

ముందు భానే అన్నాడు "నీకీ పాటికి మీ చెల్లెలు చెప్పుండాలే" తలవూపాడు కృష్ణ.

వున్నట్టుండి అతను ఆగి కృష్ణ చేతులుపట్టుకుంటూ అన్నాడు.

"ఇందులో నిజంగా నా తప్పేంలేదురా, అంతా మీ చెల్లెలే చేసింది. నేనెప్పుడో నీకు చెప్పేస్తానన్నాను. తనే వద్దంది. మా అన్నయ్యకి తెలిస్తే చంపేస్తాడంటూ. కానీ నాకు బాధేసేది. నీకు తెలియకుండా ఇలా చేస్తున్నందుకు. కానీ మీ చెల్లెలే నా నోరు నొక్కేసింది. అయినా ఇప్పుడు అలాంటివి ఏవి లేవు మా మధ్య. మేం విడిపోయాం.

"ఎందుకు"?

"నిన్ను తిడుతుంటే నేను చూస్తూ వూరుకోలేకపోయేవాడిని. మా అన్నయ్య రాక్షసుడు, నేనెప్పుడు బయటకు వెళ్ళినా తనకు కారణాలు కావాలంటాడు అనేది. నీ చెల్లెలు అని కాదుగాని మీ సునీతకు నీ మీద ఏ మాత్రం నువ్వనుకునేంత ప్రేమ లేదురా. అందుకే నాకు అసహ్యం వేసింది" అన్నాడు భాను.

భాను వెళ్ళిపోయిన తరవాత చాలా సేపు ఆలోచించాడు కృష్ణ. తర్వాత ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా ఇంటివైపు అడుగులు వేశాడు.

** ** ** **

రెండు రోజులు తర్వాత

తన పేరు మీద ఉత్తరం రావడంతో కవరు చించింది సునీత అందులో ఇలా వుంది.

డియర్ సిస్టర్ సునీతా,

నేను కృష్ణని. నీకీ ఉత్తరం అందేసరికి నేను ఈ ఊళ్ళో వుండను. వివరాలు తర్వాత చెప్తాను. చిన్నప్పట్నించి నిన్ను ఎంతో అపురూపంగా చూచుకుంటూ వచ్చాను. నేను అందరిలానే పెరిగాను. కాని అందరిలాగ వుండలేకపోయేవాడిని. కారణం ఏమిటో నాకూ తెలియదు. నాకు ప్రేమ, మమకారం, వీటి గురించి ఏమీ తెలియదు. నమ్మకం లేదు. నిజమే కాని ఒకటి మాత్రం చెప్పగలను. ఈ కాలంలో వాళ్ళెవరదీ ఆకర్షణే గాని, స్వచ్ఛమైన ప్రేమ, శాశ్వతమైన ప్రేమ కాదని ఖచ్చితంగా చెప్పగలను. అంతదాకా ఎందుకు? మీ సంగతి చూడండీ ముందు ప్రేమించుకున్నారు. ఒకరిని విడిచి ఒకరు వుండలేకపోయేవారు. చివరకు విడిపోయారు. ఎందుకు విడిపోయారంటే కారణం మీక్కూడా తెలియదు. కానీ నాకుతెలుసు.ఎందుకంటే మీ ప్రేమ విషయం ఎప్పట్నించో నాకు తెలుసు కాబట్టి, అప్పట్నించి మిమ్మల్ని స్టడీ చేసుకుంటూ వచ్చా కాబట్టి. ముందు నాకు తెలియకుండా రహస్యంగా కలుసుకోవడం మీకు గొప్ప అనుభవంగా వుండేది. నాకు చెప్పటానికి కూడా భయపడేవారు. కాని రాను రాను మీకు దొంగచాటు ప్రేమతో విసిగిపోయి మీ మనసు స్వేచ్ఛను కోరింది. కానీ మీరు స్వేచ్ఛను పొందలేరు. ఎందుకంటే మీరు పిరికివారు. ఆ పిరికితనమే మీలో ఒకరంటే ఒకరికి ఆకర్షణ తగ్గించేసింది. చివరకు విడిపోయేలా చేసింది. ధైర్యం లేని వాళ్ళు ముందు చూపు, అవగాహన లేని వాళ్ళు ప్రేమకు అనర్హులని నా అభిప్రాయం. నేనక్కడ వుంటే మీరు ఎప్పటికీ కలువలేరు మీ చేతకానితనంతో. అందుకే నేను వెళ్ళిపోతున్నాను. ఎందుకంటే మీరిద్దరు నాకు బాగా కావలసిన వాళ్ళు. నేను ఇప్పుడు వెళ్లిపోయేది దండకారణ్యంలోకి. నీకు తెలుసుగా. అక్కడ ఎక్కువ జంతువులుంటాయని - నాకు ఇలాంటి మనుష్యుల కన్నా ఆ జంతువులు మధ్య వుండటం ఇష్టం. అమ్మని నీ దగ్గర వదిలి వెడుతున్నాను. నా ఈ ఉత్తరం మిమ్మల్ని తిరిగి కలిపితే సంతోషించే వాడిలో మొదటి వాడిని. ఎందుకంటే నా చెల్లెలు జీవితం చక్కబడినందుకు.

ఉంటాను,<br>
నీ అన్నయ్య,<br>
కృష్ణ.

ఉత్తరం మడిచింది సునీత. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. గుమ్మం దగ్గర చప్పుడయితే తిరిగి చూసింది. భానూ వున్నాడు అక్కడ. అతని చేతిలో కూడా కవరు వుంది. ముందుగా ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

తర్వాత భానూ అన్నాడు ఈ ఉత్తరం... మీ ... అన్నయ్య ... నాకు

"అవును నాకూ రాశాడు" అంది సునీత.

తరువాత వాళ్ళిద్దరూ చాలా సేపటి వరకూ మాట్లాడుకోలేదు. వారి గుండెలు పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాయి.

## ఊదా దీపం

రెండు లేత అరి చేతుల మధ్యల<br>
మధ్యన రెపరెపల్తో నిల్చిన దీపకళిక<br>
నూనె నీటి రంగుల వయొలెట్ వెల్వెట్<br>
చిరు చెమటకి తడిసిన తిలకంలా<br>
ఆర్ట్ గాలరీలో ఆ దీపాన్ని నిల్చిన<br>
చేతుల్ని చూడలేక మనం<br>
పొగిలి పొగిలి ఏడుస్తాం<br>
మూడో నేత్రం లేదని అంతర్లీనంలో

'మో'